# సైలెన్స్ ప్లీజ్
## ( నాటిక )

- శంకరమంచి పార్థసారథి

పాత్రధారులు

1. రాంబాబు
2. నాగేశ్వర్రావు
3. దొంగ
4. ఎస్సై
5. రమ
6. రంగి

# సైలెన్స్ ప్లీజ్
## ( నాటిక )

- శంకరమంచి పార్థసారథి

**తెర తీసేసరికి**

అది భారీగా  అలంకరించబడ్డ ఒక గది సోఫాలు, కుర్చీలు, టీపాయి. ఓ పక్కన టేబులు దాని పైన చిందరవందరగా పడున్న వస్తువులు కనిపిస్తున్నాయి. గది ఖాళీగా వుంది ఆ గదికి ఎడమ వైపు ద్వారం వంటగదికి, కుడివైపున  వున్న రెండు ద్వారాలు ఒకటి పెరటిలోకి మరొకటి పడక గదిలోకి దారి తీస్తాయి. స్టేజికి  మధ్య ద్వారం  బయటకు వెళ్ళుటకు

లోపల నుంచి బాగా పాత సినిమా పాట వినిపిస్తోంది. ఆ ఇంటి యజమాని రాంబాబు  కళ్ళకి బ్యాండేజీతో  పడగ్గదిలోంచి  తడుముకుంటూ  హాలులోకి వస్తున్నాడు... అలా  రావటంతో  కళ్ళు కనిపించక  గుమ్మాన్ని , కుర్చీలనూ తన్నుకుంటూ వస్తూ పడబోయి తమయించుకుంటు. నిల్చుంటున్నాడు. మళ్ళీ ముందుకు  వస్తున్నాడు. ఈ ఫీటును  చేస్తూనే  భార్యని పిలుస్తున్నాడు.

రాం : రమా ఒసే రమా, నిన్నే  – ఓ రమాదేవి!

( లోపల గదిలోంచి  రెస్పాన్సు వినిపించింది )

రమ : ఆ ! ఏమిటి ! ఇక్కడ పనిలో వున్నా – ఏమిటో చెప్పండి.

రాం :  పేపరు ...పేపరింకా రాలేదా !

( అంటూనే వచ్చి టీ పాయి తగిలి బొక్కా బోర్లా పడ్డాడు. పెద్ద శబ్దం అయింది రాంబాబు ఈ సారి భార్యని పిల్చే ప్రయత్నం చేయకుండానే  లేవబోతూ అనుకుంటున్నాడు )

ఈ దిక్కు మాలిన టీపాయి ఇక్కడ కొచ్చిందేమిటి !

( రమ లోపలినించి వచ్చింది. దృశ్యం చూసింది )

రమ : ఏమిటి పడ్డారా ! లేవకండి. మిమ్మల్నే

రాం : ఏం దిష్టి తీస్తావా

రమ : అదేం కాదు ! ఎట్టాగు మళ్ళా పడతారుగా, అందుకని, అయినా ఆ పేపరు గురించి అంత తాపత్రయం దేనికట ! హాయిగా పాట వింటూ అక్కడ మంచంపైన పడుకోక.

రాం : ఆ పాట విని విని నాకు పిచ్చెక్కి పోయేట్టుంది. అయినా నా అలవాటు నీకు తెల్సుగా ! వుదయం పూట పేపరు చదివితేగాని కడుపులో కదలిక రాదు. కడుపులో కదలిక వస్తేనే గాని మోషన్ కాదు. మోషన్ అవుతే గాని ఆకలికాదు. రెండ్రోజుల్నించి పేపరు చదవక లోపలేమిటో శబ్దాలు. సంగీతాలున్నూ.

రమ : ఆకలి కావటంలేదా ! సరే అయితే ఈ పూటకి వంట చేయను పాలో కాఫీనో తాగి పడుకోండి

రాం : అంతేగాని భార్యవైయుండి మోషన్ అవటానికి కో ఆపరేట్ చెయ్యనంటావ్.

రమ : ఇది మరీ బావుంది. అదేవన్నా సిపార్సులతో అయ్యే పనా ? వెళుతున్నా...కదలకుండా కూర్చోండి. పది సార్లు పడితే ఫ్లోరింగ్ పాడైపోతుంది. తర్వాత మీ ఇష్టం

రాం : రమా.... రమా ! ఆగాగు...వున్నావా !

రమ : ఆ ! వున్నా....ఏమిటో చెప్పండి...

రాం : కాస్త హెడ్‌లైన్సన్నా చదివి వినిపించవే ! ప్లీజ్

రమ : మీకింత పేపరు పిచ్చి పనికిరాదు. అలవాటు మార్చుకోవాలి

రాం : ఏమిటి వెళ్ళిపోతున్నావా !

రమ : స్టవ్‌మీద పాలు పడేశా ! కట్టేసి వస్తా ( లోనికి వెళ్ళింది )

రాం : కళ్ళులేకపోతే కలియుగమే లేదంటారు. అమ్మో – చూపులేకపోతే కష్టమే సర్వేంద్రియానం నయనం ప్రధానం అని వూరికే అన్నారా పెద్దలు ( ఇప్పుడు రమ వచ్చింది. చేతిలో పేపరు పాతది కావటం చేత చిరిగిపోయి వ్రేలాడుతోంది )

రమ : నాకు అవతల బోల్డన్ని పన్లున్నాయి. చక చకా చదువుతా వినండి.

రాం : అలాగే..అలాగే..

రమ : స్వాతంత్ర్యం నా జన్మ హక్కు “ బాల గంగాధర్ తిలక్ ” దేశ స్వాతంత్రానికి యువకులు ముందుకు రావాలి. బాపూజీ పిలుపు. బానిసత్వంకన్నా మరణమే నయం. ప్రకాశం పంతులు ఉద్భోత. వూపకుందుకుంటున్న వుద్యమం....ఉప్పు సత్యాగ్రహ వుద్యమదారులపై గుంటూరులో లాఠీఛార్జీ, ఒంగోలులలో కాల్పులు, బెజవాడలో...

రాం : ( కంగారుగా ) ఆగాగు... ఎప్పటిదే ఆ పేపరు...

రమ : తెలియదండి. మొదటి పేజీ చిరిగిపోయింది. మూడవ పేజీ నుంచి చదువుతున్నా

రాం : ఆహహ ఫ్రీడమ్ స్ట్రగుల్నాటి పేపరు. రమా ! మ్యూజియం నుంచి ప్రత్యేకంగా తెప్పించావా.

రమ : అబ్బే లేదండి. ట్రంపెట్టెలో అడుగున చీరలు పాడవకుండా వేసుంటేను తెచ్చా ఇంతకీ మొదలైందా కదలిక.

రాం : మొదలైంది కదలిక కాదు, దిగులు. హాయిగా టాయిలెట్టులో కూర్చుని మార్నింగ్ పేపరు చదువుకునేవాణ్ణి నా ఖర్మ కాలి ఇలా అయింది నా పరిస్థితి. పేపరు. చదవవే అంటే ఫ్రీడమ్ స్ట్రగులు నాటి పేపరు చదువుతావు. పోనీ పాటలు వినిపించవే అంటే నాగయ్య, గగ్గయ్య గారి పాటు వినిపిస్తావు. పోనీ నా పక్కన కూర్చొని హాయిగా కమ్మగా రెండు మాటలు చెప్పవే అంటే. ఏవండీ మన పెళ్ళిలో సన్నాయి వాయించిన వాడు పోయాట్టనో..

రమ : అదే నాకు గిట్టదు. పనులు అన్ని మానుకొని వచ్చి పేపరు చదివినా అస్సలు మీకు కృతజ్ఞత లేదు. అయినా ఎప్పటి పేపరైతే ఏమిటి. తారీఖులో మార్పులు తప్ప వార్తల్లో ఏమైనా మార్పువుందా. అయినా అన్నయ్య గారేం చెప్పారు.

రాం : ఎవరు ఎన్‌టిఆర్ గారా ! ఆయనెప్పుడొచ్చారే ! చెప్పనేలేదు.

రమ : నా మొహం – ఆయన గురించి కాదు. నిన్న మిమ్మల్ని చడటానికి వచ్చిన మాపెత్తల్లి కొడుకు.

రాం : ఓహో ! అతనా ! అవునవును. ఏదో చెప్పాడే మర్చిపోయాను.

రమ : పేపరు చదివితే గాని మోషను కాదు అనుకోవటం సైకలాజికల్ ప్రాబ్లమ్ అని కాబట్టి ఏదో కాగితం పుచ్చుకుని. మీ కిష్టమైన వార్తలు మీరే చదువుకోండి అని అనలా.

రాం : అన్నాడన్నాడు. గుర్తొచ్చింది.

(బయట నుంచి “ పేపరు ” అని లోపలికి పడుతుంది )

ఆ పేపర్ ఇటియ్యి ట్రయి చేస్తా.

రమ : సర్లేండి... బతికించారు. ఇదిగో పేపరు మెల్లిగా పొదుపుగా చదువుకోండి ( అని లోనికి వెళ్ళిపోయింది ! ) చెప్తా ( ఇప్పుడు గొంతు పెంచి లోపల వున్న భార్యకి వినిపించేలా ) శాస్త్రవేత్తలకు జీతాల పెంపు ఇళ్ళ స్థలాలు కేటాయింపు ( లోపలి నుంచి రమ పరిగెట్టుకుంటూ వచ్చింది )

రమ : ఏమిటండి... విన్నది నిజమేనా... ! జీతాలు పెరిగాయా ! ఎంత పెరిగాయండి స్థలాలు ఎక్కడ ఇస్తారట.

రాం : చదవనీ. అలా కుర్చో . వూ జీతాలు పెంపు. మే 14. 1994 నుంచి అమలు అంటే ఎరియర్స్ బాగా వస్తాయి. కారు కొనుక్కుందామా.

రమ : కారెందుకండి దండగ. బంగారం కొనుక్కుందాం తర్వాత స్థలాలు ఎక్కడిస్తారట.

రాం : చూడాలి..స్థలాలు ( వెతుకులూ ) ఆ స్థలాలు కేటాయింపు ఆ ! స్థలాలు ఏమిలేవుటే. అంచేత బంజార హిల్సులో కొంపల్నీ పడగొట్టి రెండో దఫా ఇస్తారట.

రమ : ఇళ్ళు పడగొట్టి. ఆ స్థలాలు మళ్ళీ ఇస్తారా....నిజంగానా. అసలు జీతాలు పెరగటం నిజమేనా ?

రాం : జీతాలు పెరిగితే ఎంత బాగుంటుంది అనుకొన్నా. అదే చదివా ? మీ అన్నగారు ఇష్టమైన వార్తలు చదువుకోమన్నాడుగా.

రమ : అదా సంగతి – నిజమనుకొని పన్లు ఆపుకుని పరిగెత్తుకొచ్చా. ( కోపంగా ) జీతాలు పెరిగాయి స్థలాలు ఇస్తారా ( అని పేపరు చేతిలో పెట్టి ) అయినా మీలో మీరు చదువుకోవచ్చుగా అనుకోవటంతోనే బతుకుతెల్లారేట్లున్నాయి.ఛ.ఛ ( కోపంగా లోనికి వెళ్ళింది )

రాం : భగవంతుడా ! ఆడదాన్ని గొప్పగా సృష్టించావయ్యా. క్షణక్షణముల్ జవరాండ్ర చిత్తముల్ అన్నట్లు – క్షణంలో ప్రేమ మరో, క్షణంలో కోపం మరో క్షణంలో వైరాగ్యం ఏ క్షణంలో ఏం వస్తుందో చెప్పలేం గదా.... ( అనుకుంటూ లేచి రెండడుగులు వేసేసరికి కాలికి చీపురు తగిలింది వంగి చేతిలోకి తీసుకున్నాడు )
చీపురు కట్టలా వుంది ! ...నా కాళ్ళ దగ్గరకి ఎలా వచ్చింది ?
ప్రధాన మంత్రి గారు వూడవమంటే ఇల్లైనా వూడ్చి పారేస్తా అన్నాడు ఒక ప్రముఖుడు ఓసారి. ఇప్పుడు రమకి చెప్పకుండానే ఈ గది వూడ్చేస్తా అంటున్నాడి రాంబాబు ( వూడుస్తున్నాడు ). ఈ దెబ్బతో రమ వచ్చి గుండెలపై వాలిపోయి మీరెంత మంచివారండి అనాలి. అది లెక్క ( అనుకుంటూ వచ్చి వచ్చి కుర్చీ తగిలి కింద పడ్డాడు....సరిగ్గా అదే సమయానికి పనిమనిషి రంగిలోనికి వచ్చింది దృశ్యం చూచింది. గభాలున వెళ్ళి అతనికి చెయ్యి అందించింది )

రంగి : మెల్లిగా ....లెగండి...

రాం : ( అనుమానంగా ) లెగండా ? ఏంటి భాష మార్చావ్. వెరైటీగా వుంటుందానా ? నువ్వు వస్తావని నాకు తెలుసు. ఇలా నువ్వు నా పక్కనుండి. " కనులు లేవని నీవు " కలతపడవలదు. నా కనులు నీవిగా చేసుకొని వూడు. ' అని పాడు. నేవూడుస్తా.

రంగి : నేనండి... రంగీని. పనిమనిషిని

రాం : ( వులిక్కిపడి ) రంగీ ! నువ్వా ?

రంగి : అవునండి! నేను వచ్చేసరికి మీరు పడిపోవడం కనిపించింది. ఎంతైనా పనిమినిషిని గదా చటక్కున వొచ్చి చెయ్యి అందించా అలా పదండి...

రాం : మంచి పని చేశావ్. సర్వెంటు మెయిట్సుకి ఆ మాత్రం విశ్వాసం, తెగింపు వుండాలి.

రంగి : అది సోఫా ...కూర్చోండి...

రాం : రంగీ...నాభాధ మీ అమ్మగారికి అర్ధం కావటంలేదు. కనీసం నువ్వైనా అర్దం చేసుకో మార్నింగ్ వాకింగ్ చేసుకొనేవాణ్ణి. ఈ కళ్ళకి దెబ్బ తగిలినప్పటి నుంచి టాకింగే గాని వాకింగ్‌కి అవకాశం లేకుండా పోయింది. చిన్న సాయం చేసి పెడతావా ?

రంగి : ఏంటండి ! అమ్మగారిని పిలవమంటారా ?

రాం : అమ్మో వద్దు ! ఏం లేదు నా చేత రెండు సార్లు గదిలోనే ఇలా పచార్లు చేయించావనుకో తర్వాత నే కంటిన్యూ చేసుకుంటా....సరేనా.

రంంగి : అమ్మగారు చూస్తే అపార్ధం చేసుకుంటారండి.

రాం : అదేదో పన్లో వున్నట్టుంది. త్వరగా కానియ్యి ఇటేనా ?

రంగి : అటు కాదు...ఇటు.అలా ....అలా..

( రాంబాబుని రంగి పుచ్చుకుని నడిపిస్తోంది. రంగి భూజం పైన రాంబాబు చేతులన్నాయి )

రాం : రంగీ ! నీవెంత మంచిదానివే ! మట్టిలో మాణిక్యానివి. నీకున్నంత జాలి అభిమానం, మొహమాటం మీ అమ్మగారికి లేవు. అదే నా వర్రీ. అమెరికాలో మొగుళ్ళని పెళ్ళాలు చూసుకోకపోతే పనివాళ్ళే చూసుకుంటార్ట. తెల్సా.

( రంగీ ఇప్పుడు రాంబాబు బారినుండి తప్పించుకుని లోనికి వెళ్ళిపోగా రాంబాబు వాకింగ్. కంటిన్యూ చేస్తూనే మాట్లాడుతున్నాడు )

రాం : అర్ధం చేసుకునే పనిమనుషులు దొరకటం పెద్ద అదృష్టం. భార్యని అర్దాంగి అంటారు ఎందుకో తెల్సా ? మిగిలినసగం పనివాళ్ళకి కేటాయించారన్నమాట. నువు అంట్లు

తోముతుంటే  నాగుండెల్ని ఎవరో పిండినట్లు ఫీలింగు నువు చీపురు తీసుకుని వూడుస్తుంటే  నాకు పెన్ను తీసుకుని పొయిట్రీ రాసేయాలని ఆవేశం – అవునూ. నీకూ నాకూ దేనికంటావ్ ఈ లింకు ?

( ఇప్పుడు లోపలి నుంచి రమ వచ్చింది. రాంబాబుని గమనిస్తోంది )

రమ : ఏంటా పిచ్చిమాటలు ? ఎవరితో మాట్లాడుతున్నారు ?

( రాంబాబు కంగారు పడ్డాడు )

రాం : రమా ! నువ్వా ఎంతసేపైందీ వచ్చి !

రమ : నువ్వా అంటే నే కాక వేరే వాళ్ళెవరయినా వచ్చి వాల్తారనా ? అయినా కళ్ళకి ఆ కట్టుతో పచార్లేమిటి ? అలా సోఫాలో  కూర్చోక.

రాం : కూర్చుని కూర్చుని నాకు పిచ్చేక్కేలా వుంది. పాట వినకూడదా అంటావ్. ఆ పాటలేమిటో అన్నీ ఒకేలా వుంటున్నాయి. అది కాదే మ్యూజిక్కు డైరెక్టర్లు అంతా ఏకాభిప్రాయానికి వచ్చారా. ట్యూన్లన్నీ ఒక్కలా వుంటున్నాయి. హల్లో వున్నావా ?

రమ : వున్నా..... ఏమిటో చెప్పండి.

రాం : రామ... రామ ...మరే...మరే...

రమ : ఏమిటా మెలికలారటం.... పన్లన్నీ మానుకుని వచ్చి మీ పక్కన కూర్చోమనేగా

రాం : అరే చెప్పకుండానే అర్ధమైపోయిందే. ఇలా రా ....వూ

రమ : చాల్లే వూరుకోండి. మరీ చిన్న వాళ్ళయిపోతున్నారు. పట్ట పగలు. తలుపులు తీసున్నాయి. పైగా రంగి కూడా వుంది.

రాం : దాన్ని గూడా పిలు. సర్దాగా  మాట్లాడుకుందాం ?

రమ : ఏమిటేమిటి ? ముగ్గురం మాట్లాడుకుందామా  ? ఏ సంగతి గురించి – పోని వీధిలో ముష్టి వాళ్ళని కూడా పిల్చుకురానా మహాసభ పెట్టుకుందాం.

రాం : అర్ధమైంది..అర్ధమైంది. నిన్ను నేను ఎంతగా విసిగిస్తున్నానో నాకు అర్ధమైంది కాని ఏం చేయమంటావ్ మాటా పలుకూ లేకుండా కంచు విగ్రహంలా ఎలా కూర్చోను ! వున్నావా ?

రమ : వున్నా. ఇంతకీ మీరనేది ? పన్లన్ని మానుకుని వచ్చి మీ పక్కన కూర్చుని కబుర్లు చెప్పాలంటారు. అంతేగా ? నా వల్ల కాదు. నాకు గొంతు నొప్పిగా కూడా వుంది ( దగ్గింది )

రాం : చెప్తే చాలు. దగ్గి వినిపించక్కర్లా. అయినా ఆ రోజు నా లాబ్‌లో ప్రమాదం జరగడం. అంతమందిలో నా కళ్ళకే ఆ మంటలుతగలడం, అంతా ఖర్మ.టైం ఏం బాగాలేదు. వున్నావా ?

రమ : వున్నాను. వింటున్నాను. అయినా ప్రయోగాలు అవీ చేసేటప్పుడు జాగ్రత్తగా వుండొద్దూ. ఇంట్లో చన్నీళ్ళకి వేనీళ్ళు కలిపినట్లు అవి ఇవీ కలిపితే ఏమౌతుంది.

రాం : సర్లేవే ! సైంటిస్టు అన్న తర్వాత ప్రయోగాలు చేయక చేతబడులు చేస్తాడా? ఏదో ఆరోజు పరధ్యానంలో వుండి అవి ఇవీ కలిపేను. అవి బుస్సున పొంగి తుస్సుమన్నాయి నా కళ్ళు !

రమ : రండి ! రండి! అలా కుర్చోండి !

రాం : ( నమ్రతగా నిల్చుని ) రండి. రండి ఆ మధ్యన మీకు పక్షవాతం వచ్చినప్పుడు వద్దామనుకుంటే కుదిరింది కాదు. ఇప్పుడెలా వుంది మెడిసిన్స్ వాడుతున్నారా ?

రమ : మిమ్మల్నే ఏమిటా మాటలు. వచ్చిందెవరో తెల్సుకోకుండా మాట్లాడటమేనా ? వచ్చింది మీ ఫ్రెండు నాగేశ్వర్రావుగారు.

రాం : నాగేశ్వర్రావా ? మీ పిన్న తల్లి రెండో అల్లుడనుకున్నా.

నాగే : సర్లేరా .ఎలా వున్నావ్. కళ్ళు మంటలు, మాడుపోటు తగ్గాయా ? అన్నట్టు డాక్టరు మరీ మరీ చెప్పమన్నాడు.

రాం : ఏది ? ఫీజు గురించా ? అయినా ఆయనకంత డౌటేమిట్రా ?

నాగే : ఫీజు గురించి కాదురా ? ఆ కట్టుని ఎట్టి పరిస్థితుల్లోనూ విప్పొద్దని చెప్పమన్నాడు.

రమ : వుండండి. కాస్త కాఫీ తెస్తా.... (రమ లోనికి వెళ్ళింది )

రాం : ఇంకేమిట్రా... కంపెనీ కబుర్లు... ఎలిజబెత్ డ్యూటీకి వస్తోందా ?

నాగే : వుహూ... రావటంలా నీ గురించి దిగులు పడి పడి మంచం పట్టింది. నీకారోజు యాక్సిడెంటు ఎలా జరిగిందో కంపెనీలో కథలు కథలుగా చెప్పుకుంటున్నారు. ఆ రోజు నువ్వు ఆ విష – ( రమ రావటం చూసాడు మాట మార్చాడు ) అదే – నువ్వు డబ్బులడిగావుగా, ఇచ్చి పోదామని వచ్చా. ఇదిగో పదివేలు.

రమ : మీకు చాలా శ్రమ కలిగిస్తున్నాం !

రాం : రమా ! వచ్చావా ! ఆ డబ్బులు తీసుకో, ( నాగేశ్వర్రావుతో ) కట్టు విప్పగానే డ్రా చేసి ఇస్తార్రా.

నాగే : సర్లేరా ! ఆ మాత్రం సహాయం చేసుకోకపోతే ఎలా ?

( రమ డబ్బు తీసుకుని లోనికి వెళ్ళింది. ఇంకో గదిలోంచి రంగి వచ్చి చీపురు తీసుకుని గది శుభ్రం చేస్తోంది ) నీకేదో వుత్తరం వచ్చిందిరా ? ఇదిగో

రాం : సర్లే గుడ్డి వెధవని. ఎక్కడి నించో కాస్త చూసి చెప్పు.

నాగే : విజయనగరం నించి.

రాం : మా అన్నయ్య వుత్తరం. ఈ మధ్య వాడి కూతురికి సంబంధం సెటలయిందిలే. ఆ కుర్రాడు ఈ వూరొస్తున్నాడు. మర్యాదలూ అవీ ఘనంగా చేయమని వుత్తరం.

నాగే : అదేమిట్రా వుత్తరం నా చేతులోనే వుంది. మేటరు మొత్తం గడగడా చెప్పేసావ్. కొంపదీసి దివ్య దృష్టిగాని మొదలైందా ?

రాం : ఇది ఇప్పుడు మూడో వుత్తరం. మా వాడికి అనుమానం జాస్తి అంచేత ఒక విషయం గురించి మూడు నాలుగు వుత్తరాలు రాస్తుంటాడు. ఒకటయినా అందకపోతుందా అని... ఆ కుర్రాడు నిన్ననే వచ్చాడు.

( రంగి వూడ్చుకుంటూ సోఫాదాకా రావటం చేత నాగేశ్వర్రావు కాళ్ళు ఎత్తి సోఫాలో పెట్టుకుని రాంబాబుతో )

నాగే : అదా విషయం...సరే కాళ్ళెత్తు....

రాం : ( ఆశ్చర్యంగా ) ఏమిటన్నావ్.

నాగే : ఓసారి కాళ్ళెత్తి సోఫాలో పెట్టు.

రాం : ఎవరివి...నీవా !

నాగే : పనిమినిషి గదంతా వూడుస్తోంది. కాళ్ళెత్తి సోఫాలో పెట్టుకుంటే పని పూర్తి చేసుకుపోతుంది. ( రాంబాబు ఇప్పుడు కాళ్ళెత్తి సోఫాలో ముడిచిపెట్టుకున్నారు. రంగి ఇల్లు వూడుస్తోంది. రమ వొస్తూనే )

రమ : ఈయన చాదస్తం, వాగుడు భరించలేకపోతున్నాం అంటే నమ్మండి. ఒక్క మాట ఒక్కసారి చెప్తే అర్ధం కాదు గదా...

రాం : కాఫీ నాక్కూడా తెచ్చావా ?

రమ : పాలు విరిగిపోయినాయి. సత్యవతమ్మ గారిని అడిగి గ్లాసుడు పాలు తెస్తా కాస్తాగండి.

నాగే : నే కాఫీ తాగొచ్చానమ్మా – నా ఫ్రెండు బయట వెయిట్ చేస్తున్నాడు. నే వెడతాలే వీలైతే సాయింత్రం వస్తారా. రెస్టు తీసుకో. వస్తానమ్మా...

( నాగేశ్వర్రావు వెళ్ళే ప్రయత్నంలో గుమ్మం వద్ద చెప్పులు వేసుకుంటున్నాడు. రాంబాబు అతను వెళ్ళిపోయాడన్న వుద్దేశ్యంతో భార్యతో )

రాం : రమా ? ఈ నాగేశ్వర్రావు గాడు అలా వుంటాడు గానీ...

(రమ ఆ మాటలకి మొగుడు నెత్తిన ఓ మొట్టుమొట్టి నాగేశ్వర్రావుతో )

రమ : వుంటానండీ, మీరు కనీసం కాఫీ అన్నా ఇవ్వకుండా పంపిస్తున్నా ఏం అనుకోకండే .

నాగే : అబ్బే...ఏం పర్లేదమ్మా....వస్తానమ్మా... వస్తారా...

( నాగేశ్వర్రావు వెళ్ళిపోతాడు. రాంబాబు అనుమానంగా, నెత్తి తడువుకుంటూ )

రాం : అంటే.... వాడింకా వెళ్ళక ముందే నేను వాగేసానా ?

రమ : అందుకేగా నెత్తిన మొట్టింది. మీ కళ్ళకి కాదు నా ప్రాణానికి వచ్చింది. ప్రతిదీ నోటితో ఎలా చెప్పటం. కాస్త అర్ధం చేసుకోవాలి.

రాం : అదా సంగతి ! అంటే నెత్తిన మొట్టితే మూడో వ్యక్తి మన మధ్యన వున్నట్టులెక్కనన్నమాట టెంపరరీగా కళ్ళు లేకపోతేనే ఇంత ఇబ్బందిగా వుందే. పాపం పర్మినెంటుగా చూపులేనివాళ్ళకి ఎంత కష్టం ? కాళ్ళు లేకపోయినా పాక్కుంటూ వెళ్ళొచ్చు. చేతులు లేకపోతే మేనేజ్ చెయ్యొచ్చు. చూపులు లేకపోయినా..వున్నావా ?

రమ : ప్రతిసారి వున్నావా ? వున్నావా అంటూ అరవకండి. ఇక్కడే వున్నా.

రాం : అసలు గుడ్డి తనంకన్నా పక్షవాతమే బెటరనిపిస్తోంది. హాయిగా పడుకుని పేపరు చదువుకోవచ్చు .... ఏమిటి వింటున్నావా ?

రమ : శ్రీరామ చంద్రా ! నాకు పిచ్చెక్కేటట్లుంది.

రాం : అదయితే మరి హాయి. ఏ కష్టం తెలీదు. రమారేపు జీతాలు రాగానే ఓ అయిదొందలు పెట్టి పుట్టు గుడ్డి వారికి స్టిక్కులు, వాక్‌మన్‌లూ కొనిస్తే ఎలా వుంటుందటావ్ ! ( రమ సమాధానం చెప్పకుండా గాజులు తీసి టేబిలు పైన పడేసి జుట్టు ముడివేసుకుని స్నానానికి వెడుతున్నట్లుగా లోనికి వెళ్ళింది. రాంబాబు ఇంకా భార్య అక్కడే వున్నట్లు తన బాణీలో చెప్పుకుపోతున్నాడు )

రాం : ఏదైనా తన దాకా వస్తేనేగాని తెలీదని... అమ్మో అమ్మో చూపు లేకపోతే జీవితం ఇంత నరకం అవుతుందని అనుకోలేదే. పేపరు చదవలేం, సినిమా చూడలేం , షికారుకి పోలేం. భార్య అందాలు, పనిమనిషి చందాలు గమనించలేం. ఎవరొచ్చారో తెలీదు. ఎవరు పోతున్నారో అంతకన్నా తెలీదు.

( సరిగ్గా ఆ సమయానికి దొంగ ప్రవేశించాడు. ఇల్లంతా పరీక్షగా చూసాడు. తర్వాత రాంబాబుని, ఆ కళ్ళుకట్టుని చూసాడు. ...పరిస్థితి అర్ధమైంది ) మొన్నకి మొన్న పక్కింట్లో కళ్ళులేని ముసలాడ్ని కాపలా పెట్టి భార్యా భర్తలు సినిమాకి వెళ్ళారా..

కుర్చీలో కూర్చున్న వారు కూర్చున్నట్లే వున్నారు. కొంపమొత్తం దోచుకుపోయారు. నీకు తెల్సుగా.

( దొంగతనకేం తెలీదన్నట్లు, చేతులూపుతూ ఇంట్లోకి ఎడ్వాన్స్ అవుతున్నాడు. రాంబాబుకి ఎందుకో అనుమానం రాగా, ఒక్కసారి పెద్దగా అరిచాడు. )

రాం : ఏయ్ ! ఎవరు నువ్వు ? ఆ ! నిన్నే ...దొంగ...దొంగ...

( ఆ కేకలు విని దొంగ షాకయ్యాడు.... ఏం చెయ్యాలో తెలీయక వ్యవది లేనందువల్ల చటుక్కున సోఫా వెనకాలే నక్కి కూర్చున్నాడు. రమ ! టవలు భుజాన వేసుకుని లోపలినించి వస్తూ ....)

రమ : ఏమిటీ కేకలు ? ఎవరొచ్చారు ? మిమ్మల్నే...

ఆరాం : అంటే ఎవరూ లేరా ! ఎందుకయినా మంచిదని ఓ టప్పా వేసా ! అంటే నువ్విక్కడే వున్నావా రంగేది ?

రమ : దొడ్లో అంట్లు తోముతోంది. ఏం పంపించమంటారా ?

( అనేసి విస విసా లోనికి వెళ్ళిపోయింది )

రాం : ( దొంగ సోఫా వెనకనించి లేచాడు. అటు ఇటూ చూసాడు. కోపంగా రాంబాబు నెత్తిన కొట్టబోయి, మనసు మార్చుకుని, ఇంట్లోకి ఎడ్వాన్సు అవుతున్నాడు )

రాం : వుత్తినే కేకలు పెట్టానని విసుక్కోకు. రోజులేం బాగాలేవు. ఎందుకయినా మంచిది. నీ నాంతాడు, నల్లపూసల గొలుసు, గాజులు, వెండి సామాను తీసుకెళ్ళి బ్యాంకు లాకర్లో వుంచితే మంచిది. యజమాని చూపులేక, ఇల్లాలికి శ్రద్ధ లేకపోతే ఇంకేవన్నా వుందా ? అన్నట్టు ఆ నాగేశ్వర్రావిచ్చిన పదివేలు బీరువాలో పెట్టు నీకసలే అశ్రద్ధ ఎక్కడ పడితే అక్కడి పడేస్తావ్ ఇవిగో తాళాలు.

( జేబులోంచి తాళాలు తీసి చూపిస్తున్నాడు. దొంగ వాటిని అందుకోబోయి ఓ క్షణం ఆగి ఆలోచించాడు. తర్వాత బల్లపైన కనిపిస్తున్న గాజుల్ని తీసి చేతికి వేసుకున్నాడు

రాం : ఏమిటీ... వున్నావా !

( దొంగ వున్నానన్నట్లు తలూపాడు )

తీసుకోమరి....ఆలోచన దేనికీ...

( దొంగ ఓ అడుగు ముందుకువేసి తాళాలు అందుకునే ప్రయత్నం చేయగా రాంబాబు తాళాలు ఇచ్చినట్టు ఇచ్చి దొంగ చేతిని టక్కున పట్టుకున్నాడు. దొంగ గతుక్కుమన్నాడు )

రాం : నా వాగుడూ చాదస్తం భరించలేకపోతున్నావు కదూ ! కనీసం వూ అని గూడా అనటం లేదంటే నాకర్థమైంది. కాని ఏం చెయ్యను. మాట గూడా లేకుండా సిమెంటు బొమ్మలా ఎలా కూర్చునేది ?

( దొంగ చేతిని విడిపించుకోవటానికి విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. రాంబాబు పట్టు వదలకుండా )

ఏమిటి కోపమా ? ఆ దొంగ చూపులే చెప్తున్నాయ్ ! ఓసారి నవ్వితే చెయ్యి వదుల్తా... లేకపోతే చెప్తున్నా మీదకి లాక్కుంటూ ! తర్వాత నీ ఇష్టం.

( దొంగ కంగారుగా పిచ్చి నవ్వు నవ్వేడు. ( అది అలా నవ్వాలి. థాంక్యూ ఏమిటో నవ్వు కూడా కొత్తగా వుంది. ఏమిటి ? కంగారు ? ఓ తలుపులు తీసున్నాయా ! మన ఇంటికి వచ్చే చవట ఎవడే, రమా ! ఈ పది రోజుల్లో బాగా వళ్ళు చేసావోయి, భర్తలకి అనారోగ్యంగా వుంటే భార్యలు చిక్కిపోతారంటారు, కాని నువ్వు తప్పని రుజువు చేసావ్. చెక్కబద్దలా వుండే నీ చెయ్యి చక్కగా పూలదండలా తయారైంది ? ఏం తింటున్నావ్ ?

( లోపలినించి ఎవరో వస్తున్న అలికిడి విని దొంగ కంగారుగా ఏం చెయ్యాలో తెలీక రాంబాబు నెత్తి నొక దెబ్బ వేసాడు. రాంబాబు ఆ దెబ్బతో దొంగ చెయ్యి వదిలేసాడు. దొంగ పక్క గదిలోకి జారుకున్నాడు. రాంబాబు తల నిమురుకుంటూ )

రాం : నెత్తిన మొట్టింది అంటే మూడో శాల్తీ ఎవరో వచ్చినట్టున్నారు.

( లేచి నిల్చుని అజ్ఞాత వ్యక్తిని ఆహ్వానిస్తున్నట్టుగా ) రండి... రండి... కులాసానా అలా కూర్చోండి ....రమా ! రమా ! ఎవరొచ్చారో చూడు.

ఇంట్లో అంతా బాగున్నారా ? అన్నట్టు పవరు కట్టూ మీకూ వుందా. వాటర్ పొజిషన్ ఎలా వుంది.

(రమ లోపలి నించి వచ్చింది. భర్త ఏక పాత్రాభినయం చూసి కోపంగా )

రమ : ఏమిటా మీటింగు ! మిమ్మల్నే ...ఎవరొచ్చారని ?

రాం : ఎవరొచ్చారూ ? అంటే ఎవరూ రాలేదా ? మరయితే మాడు అదిరేటట్టు ఎందుకు కొట్టావ్ ?

రమ : నేను మిమ్మల్ని నెత్తిన కొట్టేనా ? కలా ? జోకా ?

రాం : కల కాదు జోకు అంతకన్నా కాదు... నీ చేతికి బీరువా తాళాలిచ్చి, అలా ముచ్చటగా నీతో మాట్లాడుతుంటే...వున్నట్లుండి నెత్తిన మొట్టేవుగా ?

రమ : మీ చమత్కారాన్ని మెచ్చుకునే టైం లేదు లోపలికి పదండి.

రాం : చమత్కారం కాదే. నిజం నా మాట నమ్ము. తాళాలు నీ చేతికిచ్చా. వొట్టు ఆ గాజుల చెయ్యి నాకు బాగా గుర్తు.

(రంగి లోపలి నించి వచ్చింది. చేతులు తుడుచుకుటూ )

రంగి : అంట్లు తోమి బోర్లించానమ్మా . పని పూర్తయింది వస్తా ( వెళ్ళబోగా రమకి ఏదో ఆలోచన స్ఫురించింది )

రమ : గాజులు ...చెయ్యి ..తాళాలు ! వుసేయ్ రంగీ...ఆగు !

రంగి : ఏందమ్మా త్వరగా చెప్పండి. దొరగారియింటికి వెళ్ళాలి....

రమ : దొరగారింటికి వెళ్ళాలా దొంగ మొహం నువ్వూనూ .తియ్యవే తాళాలు బయటికి

రాం : రంగి చెయ్యా అది, ఇచ్చేస్తుందిలే ...గొడవ చెయ్యకు

రంగి : ఏంటి మీరు మాట్లాడుతోంది ? తాళాలేంటి ? ఏం తాళాలు ?

రమ : ఆయన నేనుకుని నీ చేతికిచ్చిన బీరువా తాళాలు అర్థమైందా ? తియ్యి బయటికి

రంగి : అయ్యాగారు మీరనుకుని నాకిచ్చారా ? అవి నే మీకివ్వాలా ? ఏందమ్మో... పనిమనుషులంటే అంత చవకబారు మనుషులనుకుంటునారా ? మేం కూటికి పేదోల్లం గాని గునాన్ని కాదు... ఆ !

రాం : మంచి డైలాగు...

రంగి : మీరుండండి. ఏమిటీ తెగ రెచ్చిపోతున్నావ్. నీ సగంతి నాకు తెలీదనకున్నావా ? మొన్న సత్యవతమ్మ గారి దొడ్లో ఆరేసిన లుంగీ ఎలా పోయింది ?

రాం : లుంగీనా ? అంటే లుంగీలక్కూడా మార్కెట్టుందన్న మాట.

రంగి : ఇదిగో చెప్తున్నా. కాస్త మర్యాదగా మాట్లాడండి. అంతా చూసినట్టే మాట్లాడుతున్నావ్...

రమ : నన్ను ...నన్ను ...నువ్వు అంటావుటే .,...నీకెంత ధైర్యం ..నిన్ను ..నిన్ను...

రంగి : ఆ ! ఏం సేత్తావేం ? తలదీసి మొలేత్తావా ?

( రాంబాబు ఇద్దర్ని సర్ది చెప్పే ప్రయత్నంగా, రంగిని పుచ్చుకుని )

రాం : రమా నా మాట విను తొందర పడకు. నే మాట్లాడతాగా

రమ : అది రంగి. నేనిక్కడ వున్నా.

రంగి : నువ్వు రంగి గింగీ అనొచ్చు గానీ, నే మాత్రం మిమ్మల్ని ఏవండీ అనాలేం ! ఏందమ్మా మీ గొప్ప. మేం కూటికి పేదోల్లం గాని....

రాం : గునాన్ని కాదు !

రమ : అంట్ల గిన్నెలు తోముకుని బతికేదానివి నీకే అంత రోషం వుంటే నాకెంత వుండాలే ! మాట్లాడరేవండీ...

రాం : ( పెళ్ళాన్ని పుచ్చుకుని ) చూసావుటే అమ్మగారు ఎలా బాధడుతున్నారో అలాగేనా మాట్లాడేది. ఎంతయినా అది నీ యజమానురాలే...

రమ : నా మొహంలా వుంది నేను...

రాం : రమా ! నువ్వా ! ఇదేమిటే తేడా అస్సలు తెలీటం లేదు ?

రమ : సరే అయిందేదో అయిపోయింది. మర్యాదగా తాళాలిచ్చి వెళ్ళు వూ !

రంగి : నాకేం తెలీదని చెప్పాను అంతే ! మీ తాళాలు నేనేం చేసుకుంటానమ్మా

రాం : రమా ! అది నిజమేగా . ఆలోచించు....

( రంగి వెళ్ళబోగా రమ అరిచింది )

రమ : ఆగవే ! మెల్లిగా జారుకుంటున్నావ్.

( రంగి ఆగింది. రమ వెళ్ళి రంగి చెయ్యి పుచ్చుకుని లాక్కొచ్చి ఆ చేతిని రాంబాబు చేతికిచ్చింది )

రమ : ఇందాకా మీరు తాళాలిచ్చింది ఈ చేతికేనా ?

( రాంబాబు చేతిని పరీక్షించి )

రాం : కాదల్లే వుందే మారినట్టుంది.

రంగి : అయిందా ! ఈ చెయ్యేమో చూడండి.

( ఇప్పుడు రండి రమ చేతిని రాంబాబు చేతికిచ్చింది )

రాం : ఏమే రంగి... నువు కూడా నన్ను టెస్టు చేసేదానివి అయిపోయావన్నమాట ! ఇది నీ చెయ్యి. నాకు తెల్సు.

రమ : నా మొహంలా వుంది.

రాం : మొహమా ! అంటే ఇది చెయ్యి కాదా ?

రమ : మీరిప్పుడు పుచ్చుకుంది నా చెయ్యి. ఓపట్టాన మాట అర్థం కాదు గదా !

రాం : నీ చెయ్యా ...అదేమిటే గాలిపోయిన బెలూన్లా అయిపోయింది ?

రంగి : ఈ ఇంట్లో నే పన్జేయను. వేరే మనిషిని చూసుకోండి నే వెడుతున్నా.

రమ : అంటే నీ బెదిరింపులకి భయపడి ...రంగమ్మ గారూ ఇలా రండి. వచ్చి మా కొంపంతా దోచుకుపోండి అని స్వాగతం పలుకుతా అనుకుంటున్నావా ! పిచ్చి పిచ్చి వేషాలు =కట్టిపెట్టి ఆ తాళాలిచ్చివెళ్ళు.

రంగి : నాకు తెలీదు మొర్రో అంటే వినిపించుకోరే ! బాబూ తమరైనా చెప్పండి.

రాం : నేను మాత్రం తాళాలు ఓ గాజులచేతికిచ్చా. అది తిరుగులేని నిజం. నువ్వేమో కాదంటున్నావ్. ఈ ఇంట్లో ఆడాళ్ళు మీ ఇద్దరే అయినప్పుడు ఆ గాజుల చెయ్యి మీ ఇద్దర్లో ఒకరిదై వుండాలి. అది రూలు.

రమ : ఇది అమ్మా తల్లీ అంటే చెప్పదండి. పక్కన ఎస్ఐ హనుమంతారవు గారికి చెప్పి...

రంగి : ఆ ! ఎస్.ఐ.బాబుకి చెప్తారా చెప్పండి. నాకేం భయం అనుకుంటున్నారా ! ఆయనేం చేస్తాడో చూస్తాగా. పోలీసోల్లలో మాకూ తెల్సినోళ్ళున్నారు. డియస్పీ దొరగారింట్లోనే పన్చేసేది తెల్సా.

రమ : అంత ధైర్యమే వుంటే పదవే. నిజాన్ని నీ చేత ఆ హనుమంతరావు గారే కక్కిస్తారు

రంగి : పదండి. తప్పు చేసినోల్లు భయపడాలి. నాకేం భయం. పదండి ఆ ఎస్.ఐ. ఏం చేస్తాడో నువ్వేం చెప్తావో చూస్తాగా. పద

రాం : రమా ! తొందర పడక. నామాట విను....

రమ : మీరు మాట్లాడకండి పనిమినిషి ఇలాగేనా మాట్లాడేది. దాని సంగతేమిటో తేలుస్తా పదవే !

రంగి : ముందు నువ్వు పద.

రమ : ముందు నువ్వు పద.

( ఇద్దరూ ఆవేశంగా బయటికివెళ్ళారు రాంబాబు తనలో తాను అనుకుంటున్నాడు )

రాం : చిత్రంగా వుందే ! రంగేమో తాళాలు తీసుకున్నది నేను కాదు మొర్రో అంటోంది. రమ గూడా నేను కాదు అంటోంది. ఇద్దరూ కాకపోతే ఆ గాజుల చెయ్యి ఎవరిది ? ఆ ! అర్ధమైంది. ఈ మద్యన రంగి జీతం పెంచమని అడిగింది, దాన్ని వదిలించుకోవటానికి రమ ఇలా ప్లాన్ వేసుంటుంది. ఇలాంటి విషయాల్లో నా వైఫ్ యమ బ్రయిటు.

( అంతలో దొంగ పడకగదిలోంచి తల బయటకి పెట్టి చూసాడు ఎవరూ లేరని తెల్సి చిన్న సూటుకేసు చేత్తో పుచ్చుకుని బయటకి వెళ్ళాడు. సూటుకేసుని పక్కన పెట్టి బల్లమీదున్న చిన్న చిన్న వస్తువుల్ని జేబులో వేసుకుంటున్నాడు. నాగేశ్వర్రావు బయటినించి సడన్‌గా ప్రవేశించాడు దొంగ వులిక్కి పడ్డాడు. రాంబాబు అనుమానంగా ? )

అనరాం : ఎవరది ? ఎవరా వచ్చింది ? మిమ్మల్నే...

నాగే : నేనేలేరా., నాగేశ్వర్రావుని....

రాం : నువ్వు రా ... రారా...యిలా కుర్చో...!

( నాగేశ్వర్రావు దొంగవంక చూసాడు. దొంగ వినయంగా అతనికి విష్ చేసి ఓ కుర్చీ తెచ్చి సోఫా పక్కన వేసాడు. నాగేశ్వర్రావు అతని వినయానికి మగ్ధుడైనట్లుగా, తిరిగి విష్ చేసాడు. కుర్చీలో కూర్చున్నాడు )

రాం : ఏరా కూర్చున్నావా !

నాగే : ఆ ! కూర్చున్నాలేరా ! ఇక్కడ నించి వెళ్ళేసరికి కంపెనీ బస్సు కాస్తా వెళ్ళిపోయింది సరే కాసేపు నీతో కబుర్లు చెప్పి పోదామని వచ్చా. ఏమిటి మాత్రలు వేసుకున్నావా ?

రాం : ఆ వేసుకున్నారా ! రేయ్ పరమబోరుగా వుందిరా. పడుకుంటే నిద్రరాదు. వాగి వాగి గొంతు ఎండిపోతోంది. ఈ కంపెనీ డాక్టర్ కట్టు విప్పవద్దంటాడు. అసలు ఇంప్రూవ్‌మెంట్ వుందో లేదో చూడద్దూ.

నాగే : పోనీ ఓ పన్చెయ్యి. ఆయనకి తెలీకుండా ఇంకో స్పెషలిస్టుని కన్సల్టు చెయ్యి డబ్బులు పోతే పోనియ్యి.

రాం : స్పెషలిస్టంటే గుర్తుకొచ్చింది. నిన్న మా అన్నయ్యకి కాబోయే అల్లుడు వచ్చాడని చెప్పలా !

( దొంగ ఆ అల్లుడ్ని నేనే సుమా అన్నట్టు సిగ్గు నటించాడు )

నాగే : అవును చెప్పావు...అయితే...

రాం : వాళ్ళ వూళ్ళో మంచి స్పెషలిస్టున్నాట్ట. నాతోపాటు రెండ్రోజులు వుండేట్టు రండి. ఆయనకి చూపిద్దాం అంటాడు.

నాగే : మరింకేం హాయిగా కళ్ళు మూసుకుని అతనితో వెళ్ళిరా.

రాం : వెళ్ళొచ్చు కాని నా వైఫ్ అంటుంది. పెళ్ళి కాకుండానే వెళ్ళి వాళ్ళింట్లో తిష్టవేస్తే ఏం బావుంటుంది. అని దాని పాయింటూ కరెక్టే.. పైగా అన్నయ్యకి అల్లుడు నాక్కాదుగా ఏవంటావ్.

నాగే : నీ పరిస్థితి చూడగానే కుర్రాడు అలా అన్నాడు. అంటే ఆ క్రురాడు ఈ కాలం పిల్లాడు కాదని అర్ధమైపోతోంది.

రాం : అవున్రా చాలా యోగ్యుడు. బుద్ధిమంతుడు, ఎంత వినయం, విధేయత పెద్దవాళ్ళంటే గౌరవం. రేయ్ ఇప్పటికీ వుదయాన్నే లేవగానే తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తాట్ట నువ్వు నమ్ముతావా

నాగే : నమ్ముతా. వంద శాతం నమ్ముతా అంతా పిల్ల దాని అదృష్టం ( దొంగని డైరక్టుగా అడిగాడు ) ఏం చేస్తుంటారు ?

(రాంబాబు సమాధానం ఇచ్చాడు. )

రాం : లెదర్ బిజినెస్ అదేరా సూటుకేసులు మ్యాన్యుఫ్యాక్చరింగు. కొత్త మోడలు సూటుకేసు తయారు చేసాట్ట. ఈ వూళ్ళో ఎగ్జిబిట్ చేయడానికి వచ్చాడు.

నాగే : అలాగ. అంటే బాగా తెలివిగలవాడన్న మాట.

రాం : అవున్రా ఎప్పుడూ ఏమిటో పుస్తకాలు చదువుకుంటుంటాడు. నోట్సులు రాసుకోవడం. అలా వెళ్ళడం ఇలా రావటం. అస్సలు నోరు తెరిచి మాట్లాడడు తెల్సా

( దొంగ లోనికి వచ్చాడు. బల్లపైన టూ ఇన్ వన్‌ని పరీక్షిస్తున్నాడు )

నాగే : అదే మరి సంస్కారం అంటే. సైలెన్స్ ఈజ్ గోల్డ్ అని వూరికే అన్నారా. అవున్రా నీ వైఫ్ కనిపించటం లేదు. ఇంట్లో లేదా ?

( దొంగ బయటికి వెళ్ళింది అన్నట్లు సంజ్ఞ చేయగా, నాగేశ్వర్రావు అర్థమైనట్లు )

నాగే : అదా సంగతి.

రాం : ఏం సంగతి ? నా వైఫ్ గురించేగా చిన్న ప్రాబ్లమ్ వస్తేను పక్కన ఎస్.ఐ.గారింటికి వెళ్ళింది. ఏమిటి కాఫీ గురించా ? పాలు విరిగిపోయాయిట. లోనికి వెళ్ళి డికాషన్లో షుగరేసి పట్రా ఏం అనుకోక. ఏమిటి వెళ్ళావా ?

నాగే : లేదు. వెళుతున్నాను నా ఇల్లు నాకేం కొత్తా !

( అని నాగేశ్వర్రావు లేవగానే దొంగ అతనికి వినయంగా వంటగదికి దారి చూపించాడు నాగేశ్వర్రావు లోనికి వెళ్ళాడు. రాంబాబు తనలో తాను అనుకుంటున్నాడు )

రాం : ఎస్.ఐ.గారింట్లో వాళ్ళిద్దరూ ఏం గొడవ పడుతున్నారో ఏమో ! రమకి ఆవేశం ఎక్కువ చెప్తే వినిపించుకోదు...

( అంతలో ఏదో అలికిడి వినిపించగా, రాంబాబు అనుమానంగా )

ఎవరదీ నాగేశ్వర్రావ్ ! రేయ్ దొంగా ...దొంగరా ...దొంగా ( ఆ కేకలకి దొంగ లోనికి పరిగెత్తాడు. నాగేశ్వర్రావు ట్రేలో మూడు కప్పులు పెట్టుకుని వంట గదిలోంచి వచ్చాడు.

నాగే : ఏమిట్రా ఆ కేకలు ? ఏమైంది.

( దొంగకూడా అప్పుడే అక్కడికి వచ్చినట్లు గదిలోంచి వచ్చి నలుమూలలా వెతుకుతున్నాడు )

రాం : ఎవరూ లేరా ? ఏదో చప్పుడైతేనూ ఎందుకయినా మంచిదని సైరను కొట్టా. అంటే ఎవరూ రాలేదన్న మాట.

నాగే : నీకంత అనుమానం పనికిరాదురా . పట్టపగలు, పైగా చెట్టంత ఇద్దరం వుండగా దొంగ రావటమే ! అనవరసంగా హైరానా పడకు.

కాఫీ తీసుకో బాబూ ( దొంగకి కప్పు అందించాడు )

రాం : ( గాలిలో కప్పు గురించి వెతుకుతూ ) బాబూనా ! ఎక్కడ్రా కప్పు.

నాగే : కాస్త గుర్రాన్ని కట్టేయ్యండి రాంబాబు గారూ అంతా తొందరే....ఇదం

రాం : బాబు... రాంబాబు అలా వచ్చావా ?

( రాంబాబు కప్పు తీసుకున్నాడు. నాగేశ్వర్రావు వచ్చి తిరిగి సోఫా పక్కన కుర్చీలో కూర్చున్నాడు. దొంగ కాఫీ తాగుతూనే చిన్న చిన్న వస్తువుల్ని జేబుల్లోకి తోసేస్తున్నాడు. నాగేశ్వర్రావు ఫజిల్లా చూస్తున్నాడు.)

రాం : మామూలు కాఫీ కన్నా డికాషన్ బావుందిరా కదూ...

( అంతలో రమ గొంతు బయటినించి వస్తున్నట్లు వినిపించింది. దొంగ కంగారుగా ఓ కుర్చీ తెచ్చి నాగేశ్వర్రావు పక్కన వేసుకుని కూర్చున్నాడు )

రాం : ఇంటి ఇల్లాలు ఫైరింజన్లా వచ్చేస్తోంది.

( రమ రానే వచ్చింది. రంగిని తిట్టిపోస్తోంది )

రమ : దొంగ మొహం. దొంగ మొహం అని తనకేం తెలీదని ప్రమాణం చేస్తుందా ?

దొంగ ప్రమాణాలూ అదీన్నూ. ఆ జాతే అంతా. చూస్తా దాని సంగతేమిటో

నాగే : ఏమిటమ్మా. ఎవరిమీద ఆ కేకలు.

రాం : అదేరా.తాళాలు పోయినియి... రంగి మీద దానికి అనుమానం

రమ : అనుమానమా ! పోనీ ఎవరికిచ్చారో స్పష్టంగా చెప్పొచ్చుగా. అది కాదు అన్నయ్యగారూ ఈయన బీరువా తాళాలు ఓ గాజుల చేతికిచ్చానంటారు నే కానప్పుడు రంగే అవ్వాలి గదా అదే నేననేది.

( పక్కన కూర్చున్న దొంగరమతో ఏకీభవిస్తున్నట్లు తలవూపేడు )

నాగే : అది నిజమే కదరా. అయినా తాళాలు ఇచ్చేటప్పుడు ? ఎవరికిస్తున్నావో ? ఏమిటో గుర్తు పెట్టుకోవద్దు పోన్లే అమ్మా. ఎందుకొచ్చిన గొడవ. పోయినవి తాళాలే గాని బీరువా కాదుగా. జాగ్రత్తగా వుంటే సరి.

రమ : ( దొంగకి చెప్తోంది ) అసలే రోజులెలా వున్నాయి. జాగ్రత్తగా వుండొద్దూ ఒక్కదాన్ని ఎన్ని పన్లన్ని చూసుకోను చెప్పండి. వంటపని, ఇంటి పని , బజారు, పన్లు పైగా ఈయనగారికి సేవలు, పేపర్లు చదవడాలు, వుపన్యాసాలకి వూ కొట్టడాలు – నా ప్రాణం పోతోంది అంటే నమ్మండి.

రాం : సర్లేవే ఇంతకీ ఆ హనుమంతరావు ఏమన్నారు ?

రమ : ఏమంటారు. రంగీని, మొగుడ్ని స్టేషన్‌కి రమ్మన్నారు. మనల్ని ఓ కంప్లయింట్ రాసిమ్మన్నారు.

రాం : ఏది తాళాలు పోయినాయనా.

రమ : తాళాలు మాత్రమే అంటే సిల్లీగా వుంటుంది. కాస్త డబ్బు, పట్టు చీరలు పోయినట్టు రాసిమ్మన్నారు.

రాం : మరింకేం రేయ్ కాగితం తీసుకో. కంప్లయింటు రాయి. వూ!

రమ : అన్నయ్యగారూ కాగితం తీసుకుని నాలుగు ముక్కలు మీరు రాస్తే ఆయన చేత గుడ్డి సంతకం చేయిస్తా.

నాగే : అలాగేనమ్మా. దానిదేం వుంది. ..కాగితం ఎక్కడ ?

( రమ టేబిలుపైన కాగితం, పెన్ను ఇచ్చింది, ఖాళీ కప్పులు తీసుకుని లోనికి వెళుతూ )

రమ : పదివేలు డబ్బు, 4 పట్టుచీరలు, రెండు వుంగరాలు, టు – ఇన్‌వన్ పోయినట్లు రాయండి. హనుమంతరావు గారు అన్ని ఇప్పిస్తానన్నారు

రాం : ఇప్పిస్తానన్నారా ! కక్కిస్తానన్నారా !

నాగే : పోలీసులెప్పుడూ అయిన వాళ్ళకి ఇప్పిస్తారు. కాని వాళ్ళ చేత కక్కిస్తారు. నువ్వెళ్ళి పన్చూసుకోమ్మా...నేరాస్తాగా...

రమ : వంటకి ఆలస్యం అయిపోతోంది. వడ్డించడం ఒక్క అయిదు నిమిషాలు లేటయితే కేకలు, రంకెలు వేస్తారు.

( లోనికి పరిగెత్తింది. నాగేశ్వర్రావు కంప్లయింటు రాస్తున్నాడు. దొంగ లేచి రెండు పచార్లు చేసి కూర్చున్న కుర్చీని తీసుకుని బయటికి వెళ్ళాడు. నాగేశ్వర్రావుకి ఏదో అనుమానం వచ్చింది. అడగబోయినంతలో రాంబాబు అన్నాడు )

రాం : రేయ్. రమ అలాగే అంటుంది గానీ, అవన్నీ  పోయినట్లు రాయక. బావుండదు.

నాగే : మరి...పోనీ పదివేలు క్యాష్, సూటుకేసు, కుర్చీ పోయినట్లు రాసేస్తా...ఓకేనా...

రాం : ఏమిట్రా నువ్వు గూడా విలేజి  బ్రూట్‌లా మాట్లాడతావ్. దొంగ వెధవ ఎంత అనుభవం లేనివాడైనా డబ్బు  తీసుకుపోతాడు. నగలు, చీరలు తీసుకుపోతాడు గాని, కుర్చీలు, మంచాలు డ్రస్సింగు టేబిల్సు తీసుకుపోతాడ్రా. ఫాల్సు కంప్లయింటయినా రీజనబుల్‌గా వుండాలి.

నాగే : సరే అయితే కుర్చీ క్యాన్సిలు. మరి క్యాష్ పదివేలు ఓకేనా...

రాం : కావాలంటే అది పెంచు . పదిహేను వేలు అనిరాయి.  పదివేలు నువు ఇచ్చినట్లు  అయిదు వేలు ఇంట్లో వున్నవి – మొత్తం పదిహేను వేలు పోయినట్లు రాయి.  కేసు  బలంగా వుంటుంది. ఏమిటి రాసావా !

నాగే : సరేలేరా ...వ్రాశా సంతకం చెయ్యి

( రాంబాబు చేత సంతకం  చేయించటానికి నాగేశ్వర్రావు కుర్చీలోంచి లేచాడు. దొంగ హడావుడిగా వచ్చి రాంబాబు  కూర్చోబోయి ధాంమ్మని  కిందపడి అయోమయంగా ?)

నాగే : ఒరేయ్?... నాకీ సంగతి చెప్పు మీ అన్నకి  కాబోయే అల్లుడు కుర్రాడు...

రాం : పేరు సతీష్‌రా చాలా యోగ్యుడు ... ఒక్క క్షణంఖాళీగా వుండడు.  ఎంత యాక్టివో మాటల్లో చెప్పలేను.

నాగే : చెప్పొద్దు. నా కర్ధమైంది. వెరీ పెక్యూలియర్ పర్సన్

రాం : యస్.వెరీ  వెరీ పెక్యులియర్. సరేగాని. చిన్న మెల్పు  చేసిపెట్టు.

నాగే : ఏమిట్రా ! స్టేషన్‌కు వెళ్ళి ఈ కంప్లయింటు ఇచ్చేసి రమ్మంటావా ?

( సరిగ్గా అదే సమయానికి ఎస్.ఐ .హనుమంతారవు  ప్రవేశించాడు. ప్యాంటు, షర్టు వేసుకున్నాడు. చేతిలో బ్రీఫ్ కేసుంది )

హను : మీకెందుకండీ ఆశ్రమ నే వచ్చాగా ? ఏం రాంబాబు గారూ ఎలా వున్నారు !

రాం : ఎవరా వచ్చింది ?

మను : నేనండీ హనుమంతరావుని స్టేషన్‌కి వెడుతూ  వెడుతూ ఇలా వచ్చా !

నాగే : రండి... రండి...ఆలా కూర్చో=ండి ఇదిగో కంప్లయింటు...

హను :మీరెవరూ ? బందువులా ( దొంగని ప్రశ్నించాడు )

రాం : పేరు నాగేశ్వర్రవు. బాగా కావాల్సిన వాళ్ళు...రమా...రమా ..ఏం చేస్తున్నావే...

రమ :ఏమిటి మళ్ళా పడ్డారా ?

మీరా అన్నయ్యగారూ... ఆ దొంగ మొహం ఏవంటుంది ?

హను : దొంగలు దొంగతనం చేసావని , హంతకులు హత్యల చేసామని అంత తేలిగ్గా ఒప్పుకుంటారా చెప్పండి.

నాగే : బాగా చెప్పారు...అంత తేలిగ్గా ప్రతి వాడూ వప్పుకుంటే పాపం లాయర్లు ఎలా బతికేది ?

రమ : ఇంతకీ మమ్మల్ని ఏం చెయ్యమంటారు ? మీరే చెప్పాలి.

హను : చూడమ్మా పోయినవి బీరువా తాళాలు. బీరువా కాదు. దానిలోని సొమ్ముకాదు ఇంకోళ్ళు ఇంకోళ్ళు అయితే పట్టించుకోరు కాని...

రాం : కాని నా వైఫ్ తాళాలు కాదు తాటాకు బద్ద పోయినా తహ తహలాడిపోతుంది.

నాగే : సర్లేవోయ్...లేడీస్ సెంటిమెంటు నీకేం తెల్సు ?

మను : వెల్‌సెడ్ – అంటే బాగా చెప్పారు. మీకందరికీ ఓ రహస్యం చెప్తా జాగ్రత్తగా వినండి. కాలంతో పాటు క్రయిము గూడా బాగా మారిపోతోంది. పూర్వం దొంగలంటే స్పెషల్ మేకప్పులతో వుండేవారు.

రమ : అవునండి. బుర్రమీసాలు, గళ్ళలుంగీ...

నాగే : బొడ్లోపిడి బాకుకాళ్ళకి కిర్రు చెప్పులు....

హను : వెల్‌సెడ్ ఎంత బాగా చెప్పారు. కానీ ఇప్పుడు – వుహూ దొంగెవడో దొరెవడో చూసి చెప్పండి చూద్దాం. మీ వల్ల కాదు ( అంతలో దొంగ ప్రవేశించాడు, నిశ్శబ్దంగా వచ్చి నాగేశ్వర్రావు పక్కన నిల్చున్నాడు. వింటున్నాడు )

నాగే : అసలు మనకన్నా దొంగలే టిప్పుటాపుగా వుంటున్నారు. మొన్నకి మొన్న.....

హను : మొన్నటిదాకా దేనికండి... నిన్న ....జస్టు యస్టర్‌డే...

రం : నిన్నటి దాకా వెళ్ళారు... ఇవాళ మా ఇంట్లో జరిగిన సంగతే తీసుకోండి. గాజులు చెయ్యికి నే తాళాలివ్వడం ఏమిటి ....

హను : అసలే నేనంటాను. తాళాలు మీరు ఏ గాజుల చేతికి ఇవ్వలేదు. మీకు కాలక్షేపం కోసం కావాలని ఇలా నాటకం ఆడుతున్నారని ఏవంటారు ?

రమ : ఏవండి నిజమా. కంప్లయింటు  గూడా రాసాం నిజం చెప్పండి.

నాగే :  రేయ్.... హనుమంతరావు గారు ఎంత నీకు  నైబరయినా  ఇలా ఆడుకోవడం ఆరోగ్యకరం కాదు ..నిజం చెప్పెయ్యి...

రాం : రామ రామ నే నిజంగా తాళాలు ఓ గాజు చేతికిచ్చా వొట్టు...

హను : లా ముందర వొట్లూ గిట్టు నిలబడవ్. సాక్ష్యాలు  కావాలి అయినా మీకు పెళ్ళయి ఎన్నాళ్ళయ్యింది ?

రాం : పదిహేనేళ్ళు

హను : పదిహేనేళ్ళుగా కాపురం చేస్తూ భార్య చెయ్యేదో, పని మనిషి  చెయ్యేదో గుర్తుపట్టలేక పోయారంటే నాకు నమ్మశక్యంగా లేదండి...

రమ : సర్లెండి ...చెయ్యిదాకా  వెళ్ళారు...హఠాత్తుగా చూస్తే నా మొహం  గూడా కొత్తే ఆయనకి

హను : అంటే  వారికి మీ మొహంతో పరిచయం తక్కువా ?

నాగే : కాదులెండి. మావాడు ఎంతైనా సైంటిస్టు గదా... ఎప్పుడూ ఆలోచనల్లో వుంటాడు

హను : వెరీ గుడ్ వుండాలి. ఎవరి ఫీల్డు గురించి వాళ్ళు అలా ఆలోచించాలి. ఇప్పుడు  నేనే వున్నా డిపార్టుమెంటులో  జాయినయ్యి పదిహేనేళ్ళయ్యింది. ఎంతో స్టడీ చేసాను. ఎంతో  సాధన చేసాను. వందలు, వేలమంది మధ్యన ఒక్కో దొంగవెధవున్నావాసన చూసి చెప్పగల్ను

( దొంగ ఎంత గొప్పవారు అన్నట్లు చేతులు తిప్పాడు )

నాగే : మీలాంటి వాళ్ళు వుండబట్టే కొంతమందయినా దొరుకుతున్నారు.

హను : వెల్‌సెడ్ – అంటే బాగా చెప్పారు.  మొన్న  ఓ చిత్రమైన కేసోకటి వచ్చింది. రైలొచ్చి ఓ  స్టేషన్లో  ఆగింది. ఒకతను  ఆదరాబాదరాగా వచ్చి కూర్చున్న వ్యక్తిని మాష్టారు కాస్త ఆ పెట్టె ఇలా ఇస్తారా  అన్నాట్ట ఆ కూర్చున్న వ్యక్తి ఆ పెట్టెని ఇలా తీసి అలా ఇచ్చాట్ట.

( తన బ్రీఫ్‌కేసుని తీసుకుని  దొంగ చేతికిచ్చాడు )

రాం : అంటే ఆ పెట్టె  అడిగినవాడిది కాదా ?

హను : కాదు అదే చిత్రం. ఆ వ్యక్తి ఆ పెట్టె తీసుకుని

( దొంగ ఎస్.ఐకి నమస్కారం చేసి చక చకా బయటికి వెళ్ళిపోయాడు )

అచ్చు అలా వెళ్ళిపోయాడు.

నాగే : తర్వాత....

హను : ఇక తర్వాతేముంది. అసలు ఓనరు వచ్చాడు. పెట్టె కనిపించక
లబోదిబోమంటుంటే పక్కనున్నవాళ్ళు ఇదిగో ఈయనే మీ పెట్టెని ఎవరికో ఇచ్చాడని
చెప్పారు.

అంతే కంప్లయింటు... పోలీసులు...డబ్బు ..కోర్టులు...

నాగే : అరెరే పాపం అమాయకుడు అతన్ని వదిలేసారా ?

మను : ఎలా వదుల్తారండి. ముక్కు మోహం తెలీకుండా పెట్టెలు అలా ఇవ్వటమేనా
అర్నెల్లు జైలు పడింది.

కాసిన్ని నీళ్ళిప్పిస్తారా ? టాబిలెట్ వేసుకోవాలి.

రమ : అలాగే అన్నయ్యగారు...

హను : ఒసే రమా... నన్ను కాస్త టాయిలెట్టుకి తీసుకెళ్ళు...

రమ : సరే పదండి...

( రమ, రాంబాబుని లోనికి నడిపించుకుంటూ తీసుకువెళ్ళింది )

నాగే : టాబిలెట్టు అంటున్నారు షుగరా....

( మాటి మాటికి వీధి వంక చూస్తూ )

హను : కాదు...

నాగే : బిపి అయ్యుంటుంది.

హను : అబ్బే కాదు...

నాగే : అంటే బలానికి అన్నమాట.

మను : వున్న బలంచాలు

నాగే : అవును ఎవరన్నా రావాలా. అలా మాటి మాటికి గుమ్మం వంక చూస్తున్నారు

హను : రావద్దూ...అతనే...ఇప్పుడు నా బ్రీఫ్ కేస్ పట్టుకు వెళ్ళారే చాలా బాగా నటించారు
ఆ రోజు జరిగింది. కళ్ళకు కట్టినట్టు చూపించాడు. ఎవరతను

నాగే : మన రాంబాబుకి అన్నయ్యకి అల్లుడు

హను : రాంబాబుకి అన్నయ్యకి అల్లుడా – అంటే జాయింటు అల్లుడా.

నాగే : కాదండి సింగిల్ అల్లుడే రాంబాబు అన్నయ్యగారికి కాబోయే అల్లుడు. వెరీ
జీనియస్ పక్కా జెంటిల్మన్. నోరెత్తి మాట్లాడడం ఇంతవరకు వినలేదు. వస్తాడు
పోతాడు వస్తాడు. పోతాడు.

హను : మళ్ళా వస్తాడుగా...అహ ఆ బ్రీఫ్‌కేసులో ఓ కేసు ఫైలు, డాక్యుమెంట్సు వున్నాయి.
నా ఉద్యోగం పోతుంది.

నాగే : భలే వారే పక్కా జెంటిల్మన్. నే కాగితం రాసిస్తా...

మను : అయితే సరే .... ( రమ నీళ్ళ గ్లాసుతో వచ్చింది )

రమ : వాటర్ తీసుకోండి. ఇంతకీ కంప్లయింటు అన్నయ్యగారికి ఇచ్చారా ?

నాగే : ఇంకాలేదమ్మా ఇదిగో ఇస్తున్నా....

హను : ఏం పోయినాయని రాసారు !

నాగే : అదేనండి.. పదిహేను వేలు క్యాష్ చీరలు, ఓ పెట్టె

హను : పెట్టా – నాది కాదుగా

నాగే : భలే వారే వూరికే రాసాం. మీరు రాయమన్నారట.

రమ : మీరు మాకు సహాయం చేయాలి అన్నయ్యగారు ?

హను : చూద్దాం అమ్మా... చూద్దాం

( అంతలో లోపలినించి పెద్ద శబ్దం ఆ వెంటనే ఒసే రమా అన్న పిలుపు
వినిపించటంతో రమ లోనికి పరిగెత్తింది )

రమ : ఈయన బాత్‌రూంలో పడ్డారలే వుంది. ఆ వస్తున్నా

(హనుమంతరావు బిక్కమొహంతో గుమ్మం వంక చూస్తూ ....)

హను : ఒక్కసారి అలా బయటికి వెళ్ళి చూసొస్తారా..ఒకవేళ పక్కా జెంటిల్మన్ అన్నారు
కాబట్టి పిలిస్తేనే గాని రారేమో ....

నాగే : అదీ పాయింటే ...చూసొస్తా...

( నాగేశ్వర్రావు బయటికి వెళ్ళబోగా ఎదురుగా రంగి అపరకాళిలా వచ్చింది )

రంగి : నన్ను దొంగ మొహం అంటారా ? నా అంతు చూస్తానంటారా ? నన్నూ. నా
మొగుడ్నీ పోలీసులకు పట్టిస్తారా ? ఇప్పుడు రమ్మను. ఎవరేంటో తెల్సిపోతుంది.

( సరిగ్గా అదే సమయానికి రమ, రాంబాబుని తీసుకొచ్చింది )

రమ : ఏమిటీ మళ్ళీ వచ్చావ్. కాళ్ళపైన పడి బతిమాలుకోటానికా ? అదేం కుదర్దు.

రాం : ఎవరూ వచ్చింది రంగీ !

రమ : అబ్బే కాదు – మాధురీదీక్షిత్ !

నాగే : అవున్రా ... మీ పని మనిషి

మను : నిన్ను ఇక్కడికెవరు రమ్మన్నారు. అసలు స్టేషన్లోంచి బయటికి ఎలా వచ్చావ్

రంగి : ఎలా వచ్చానా ? డి.ఎస్పీ దొరగారికి ఫోన్ చేసి వచ్చా

( ఆ మాటకి హనుమంత రావు కంగారు పడ్డాడు, కానీ గంభీరత నటిస్తూ )

హను : ఏమిటి . డియస్పీ దొరగారికి ఫోన్ చేసావా నువ్వు ? నీ పేరేమిటన్నావ్

రమ : రంగి

మను : నేనెవర్ని ఎస్ఐని పదిహేనేళ్ళ అనుభవం వున్నవాడ్ని. నాకు చెప్తావుటే కథలు దొరగారి భార్య, ఆవిడ బంధువుల , స్నేహితులు నాకు బాగా తెలుసు. నిద్దట్లో లేపి ఫేసు చూపించినా ఇట్టే చెప్పగల్ను.

రమ : ఆయన పేరు చెప్తే భయపడతామని దాని ధీమా....

నాగే : దొరగారికి మీకూ ఏంటమ్మా పరిచయం ...చుట్టానివా ? పక్కానివా

రంగి : రెండూ కాను. వాళ్ళింట్లో పని మనిషిని...

హను : పని మనిషివా ?

రంగి : అంతే కాదు వంటమనిషిని కూడా

రాం : రంగీ ...ఎందుకొచ్చిన హెచ్చులే ...తప్పేదో ఒప్పేసుకుని లెంపలేసుకో సరిపోతోంది...

రంగి : ఇవాళ దొరగారింట్లో ఏదో ఫంక్షన్న....

హను : అవును... దొరగారి మ్యారేజ్డే... అయితే...

రంగి : ఎక్కడి పన్లు అక్కడేవున్నాయి.... వెంటనే రమ్మన్నారు...నే రానన్నాను. జరిగిందంతా విన్నారు. మిమ్మల్ని వెంటనే ఫోన్ చేయమన్నారు.

హను : ఆ ! దొరగారు నన్ను ఫోన్ చేయమన్నారా ! మరి ఇప్పుడా చెప్పేది. అమ్మో అసలె స్ట్రిక్టు అందులో మ్యారేజీడే.. నే వెళ్ళి ఫోన్ చేసి ( నాగేశ్వర్రావుతో ) ఈ లోపున వచ్చేస్తాడుగా

నాగే : పక్కా జెంటిల్మన్ రాసిస్తా...

హను : అయితే సరే..నే వెళ్ళి ఫోన్ చేసి వస్తా రంగి... సారి రంగమ్మ గారు అలా కూర్చోండి. ఎంత సేపు అని అలా నిల్చుంటారు. అలా కూర్చోండి. నా గురించి దొర గారికి ఏమైనా చెప్పారా ?

రంగి : చెప్పా...అన్యాయంగా నన్నూ నా మొగుడ్ని దొంగతనం అంటగట్టి స్టేషన్లో కూర్చోపెట్టారని చెప్పి ఏడ్చాను కూడా...

హను : ఏడ్చావు కూడానా ...ఆయనకసలే లేడీస్ సెంటిమెంటు ఎక్కువ వెంటనే వెళ్ళి ఫోన్ చేయాలి.

( గుమ్మందాకా వెళ్ళి రివ్వున వెనక్కి వచ్చి, నాగేశ్వర్రావుతో ) అతనొస్తే ఆ పెట్టె జాగ్రత్త నేనిప్పుడే వస్తా ( పరిగెత్తాడు )

రాం : నాగేశ్వర్రావు. ఆ ఎస్.ఐ.గారేంటిరా ఆ కుర్రాడు ఆ కుర్రాడు అంటున్నారు ఎవరి గురించి...

నాగే : ఆ సంగతి చెప్పాలంటే చాలా చెప్పాలి... అయినా ఈ గొడవలంతటికి కారణం నువు కాదు, ఆ తాళాలు ఇచ్చేముందు ఎవరు ఏమిటి అని ఒక్క మాటన్నా అడిగావా ?

రమ : అలా అడగండి. చేసేదంతా చేసి శిలా విగ్రహంలా ఎలా కూర్చున్నారో. ఏమే ఇప్పటికయినా ఆ తాళిలిచ్చేయి సరేనా...

రంగి : తాళాలివ్వటం కాదు మీ పైన కేసు పెట్టకపోతే నా పేరు రంగి కాదు ...

రాం : కేసా ? ఏం కేస్

నాగే : పరువు నష్టం దావా అయ్యుంటుంది,. ఏ ప్లీడర్ని అడిగినా వివరాలు చెప్తారు...

రంగి : నా మొగుడు ప్లీడరు గారు దగ్గరికే వెళ్ళాడు... ఏ క్షణంలోనైనా వస్తారు...

రాం : రమా ! అది ఇంతగా వాదిస్తోంది అంటే మనం పొరపాటు పడ్డావేమో అనిపిస్తోందే దాన్ని పోనియ్యి

రమ : దాన్ని పోనిస్తా సరే... మరి తాళాలు మీరు ఎవరికిచ్చినట్లు

నాగే : మరా పాయింటు తేలాలిగా ( హనుమంతరావు కంగారుగా వచ్చాడు )

మను : నా కొంప ముంచెరు గదండి ఈ రంగమ్మ గారు ఆ దొరగారికి ఇంత కావాల్సిన మనిషి అని తెలీక తొందరపడ్డా...

రమ : ఏవైంది అన్నయ్య గారూ...

మను : అన్నయ్య గారా నా పిండాకూడు గారా ! అయినా ఏమిటమ్మా ముష్టి తాళాలు పోతే ఇంత రాద్ధాంతం చేస్తారా ? రిజర్వు బ్యాంకు తాళాలు పోతేనే డూప్లికేట్లు చేయించుకుంటున్నారు.

నాగే : ఇంతకి దొరగారు ఏవన్నారు.

హను : ఏమీ అన్లా... నే ఫోన్లో సార్ నేను హనుమంతరావుని అన్నా అంతే ! పళ్ళు పట పట

కొరికి  ఇవాళ నా మ్యారేజ్ డే అనుకున్నావా, నా శ్రాద్ధం అనుకున్నావా ! మా ఇంటి పనిమనిషిని స్టేషన్లో కూర్చో పెడతావా.  వెంటనే రంగిని పంపించి, ఆ తర్వాత నువ్వురా  అని ఫోన్ కాస్తా పెట్టేసారు.

రంగి : అర్ధమైందిగా... ఇప్పుడు చెప్పండి ..ఎవరు దొంగో, తాళాలు  ఎవరికిచ్చారో తేలాలి.

హను : రంగమ్మ గారూ తాళాలు పోతే  పోయినాయి నో వర్రీ నువు వెంటనే దొరగారి ఇంటికి వెళ్ళకపోతే  నా పరువు, ఉద్యోగం  రెండూ పోతాయి పదండి నే తీసుకెడతా ప్లీజ్

రంగి : అదేం కుదరదు. ఈ నాటకం ఏమిటో  తేలిపోవాలి నే  అమాయకురాలినని  అంతా ఒప్పుకోవాలి.

హను : ఒప్పుకుంటారు ...నే ఒప్పిస్తా రాంబాబు గారూ చెప్పండి . రంగికేం  తెలీదు.. అమాయకురాలు అని చెప్పండి.

రాం : చూపులేని  వాడి సాక్ష్యం చెల్లుతుందా అని రమా – అయిందేదో అయింది.

నాగే : అవునమ్మా... నా మాట విను. తాళాలేగా పోయింది. పోనియ్యి నే వెళ్ళి డూప్లికేటు చేయించి తీసుకొస్తా సరేనా ?

హను : త్వరగా చెప్పమ్మా....రంగి అమాయకురాలు అని చెప్తే చాలు

రంగి : సారీ అని కూడా చెప్పాలి.

రాం : అది నే చెప్తాలే... రమా ...వూ ...త్వరగా

రమ : ఎస్.ఐ గారు చెప్తున్నారు కాబట్టి చెప్తున్నా  రంగి అమాయకురాలు

రాం : సారినే రంగి వుయ్ ఆర్ వెరీ సారీ...

హను : హమ్మయ్య  రంగమ్మ  గారూ పదండి పోదాం దొరగారు వెయిట్ చేస్తుంటారు వూ...

రంగి : ఆగండాగండి. అమయకురాల్ని  పట్టుకుని  దొంగతనం  అంటగట్టి  స్టేషన్కి పంపి నా పరువు తీసారు మరి పరిహారం.

రాం : పరిహారమా ? ఎంతా ?

రంగి : వెయ్యి రూపాయిలు

రమ : వెయ్యి రూపాయిలా ! రూపాయి గూడా ఇవ్వం నీ దిక్కున్న చోట చెప్పుకోపో...

రంగి : అయితే దొరగారితో ....

హను : నేనిస్తా... వెయ్యి రూపాయలు నేనిస్తా ..తీసుకో...

( బ్రీఫ్ కేస్ గురించి వెతికి గుర్తుకొచ్చినట్లుగా )

హను : ఏవండి అతను ? అంతా దాంట్లో వుంది. ఏమైపోయాడు ? పారిపోయాడా

నాగే : పక్కా జెంటిల్మన్ రాసిస్తా...

రాం : ఎవరి గురించిరా .... నాగేశ్వర్రావ్...నిన్నే!

నాగే : అదేరా ...మీ అన్నయ్యకి కాబోయే అల్లుడి గురించి పక్కా జెంటిల్మన్ రాసిస్తా...

రాం : పక్కా జెంటిల్మన్ సరే... ఎప్పుడొచ్చాడు ? నీకెలా తెల్సు ?

నాగే : వీడో పెద్ద ట్రబులై పోయాడండి... అంతా వింటాడు మళ్ళీ మొదలుకొస్తాడు...

నువ్వన్నా చెప్పమ్మా...

రమ : మా బావగారికి కాబోయే అల్లుడు వచ్చాడా ? ఎప్పుడు !

నాగే : అదేమిటమ్మా ..నువు గూడా ఇందాకటి నుంచి ఇక్కడ కూర్చొని మాట్లాడలా !

రమ : అంటే అతను మీతోపాటు రాలేదా ?

రాం : ఎవరే వాడు ?

నాగే : నాతో రావటం ఏమిటమ్మా నేవచ్చేసరికే దర్జాగా ఇంట్లో తిరుగుతుంటేను

హను : ఆ ! అంటే అతను మీ తాలూకు కాదా...పక్కా జెంటిల్మన్ అని అన్నావు కదరా

నాగే : అదేమిటమ్మా – నువ్వన్నా అడగొద్దు...ఎవరతను అని

రమ : నాకేం తెల్సు మీతోపాటు వచ్చారేమో అనుకున్నా....

రాం : రమా నాకేంటో అనుమానంగా వుందే...

రమ : నా వల్లకాదు...పొక్కుంటూ పాయిఖానాకి వెళ్ళండి.

రాం : ఆ అనుమానం కాదే. లోపల బీరువాలో డబ్బులు, చీరలు చూసుకో

రమ : ఆ ! ఓరి దేవుడో ( పరిగెత్తింది )

రంగి : అంతేనండి దొంగలు దొరల్లా తిరుగుతూ దోచుకుపోతుంటే – అమాయకుల్ని

అనుమానిస్తారు ఇప్పుడు తెల్సిందిగా.

హను : నా పెట్టెపోయింది. డాక్యుమెంట్సు, డబ్బులు మైగాడ్ – పక్కా జెంటిల్మన్ పక్కా

జెంటిల్మన్ అన్నావు గదార...

నాగే : మీరు మాత్రం వాసన చూసి చెప్తానన్నారా... ఏం చెప్పగలిగారు

( రమ వచ్చింది ఏడుస్తూ ? )

రమ : అయ్యో కొంప మొత్తం దోచుకుపోయాడండి. డబ్బు చీరలు, వస్తువులు

మను : నా బ్రీఫ్ కేసు.

రమ : ఓరి దేవుడో ఎంత మోసం జరిగిందిరా. కొంపంతా వూడ్చి పెట్టిపట్టుకుపోయాడ్రో

రాం : నాగేశ్వర్రావు – అయినా నువ్వు చదువుకున్నవాడివి గదా. ఎవరినో చూసి వాడే మా అన్నయ్యకి కాబోయే అల్లుడు అనుకోవటం ఏమిట్రా ఒక్క మాట నన్ను అడగొద్దూ ?

హను : మీరు మీరు తర్వాత మాట్లాడుకోండి. నే చెప్పేది వినండి. మీ ఇంట్లో మీ మనిషిలా నటించి నా బ్రీఫ్‌కేసు పట్టుకుపోయాడు. ప్రభుత్వం రికార్డు పోవటానికి మీరే బాధ్యులు గంటలోగా పెట్టెన్నా రావాలి. మీరు నేరం అన్నా ఒప్పుకుని స్టేషన్‌కి రావాలి. తెల్సిందా ?

రాం : సార్..సార్ ...ఈ ఒక్కసారికి వదిలెయ్యండి...

నాగే : అవున్సార్... నెక్ట్స్ టైం మేమే వచ్చి సరండరయిపోతాం...ఏరా...

హను : నో ఫన్నీ బిజినెస్ ఐ యామ్ వెరీ సీరియస్. నా మంచినే చూసారు నా దుర్మార్గాన్ని ఇక చూస్తారు ... బి రెడి..

( రంగీతో ) ఏవండీ ఇహ మనం బయల్దేరుదామా. పాపం అక్కడ మీ కోసం వాళ్ళు వెయిట్ చేస్తుంటారేమో.

రంగి : సొమ్ము నిజంగా పోగొట్టుకున్నారు కాబట్టి క్షమిస్తున్నాం. ఎప్పుడూ చూడకుండా నిందలు వేయకండి...ప్రతి వారికి పరువు ప్రతిష్టలు వుంటాయి. చేసే పనిని బట్టి కాకుండా, నిజాయితీ, నీతి బట్టి గౌరవించడం నేర్చుకోండి ..పదండి..

హను : పదండి....

( రంగి హనుమంతరావులు వెళ్ళిపోగా )

రమ : అయ్యో ఇల్లంతా ఎంత బోసిపోతోందో ...వాడి మొహం మండిపోను వాడి నోరు పడిపోను వాడి కళ్ళు పేలిపోను.

నాగే : చూడమ్మా ఏమనుకుని ఏం లాబం వాడి మొహం నాకు బాగా గుర్తు పద. రెండు బజార్లు తిరిగొద్దాం. లక్కీగా దొరుతాడేమో

రాం : అవునే రమా వెళ్ళి రండి వూ...త్వరగా

( రమ, నాగేశ్వర్రావులు బయటికి వెళ్ళారు. రాంబాబు లేచి పచార్లు చేస్తూ )

రాం : ఆ దొంగ ఎవడో గాని గొప్ప టైమింగు, మంచి సెన్సాఫ్ హ్యూమరు

వున్నవాడల్లేవుంది. లేకపోతే ఇంత మందిని నమ్మించగలిగే వాడా ? నే కళ్ళు లేక గుడ్డివాడినయ్యా వీళ్ళంతా కళ్ళు వుండి గుడ్డివారయ్యారు. చూపుకన్నా చురుకుదనం తెలివితేటలు ముఖ్యం నిజంగా తల్చుకుంటుంటే ఆ దొంగ పైన నాకు గౌరవం పెరిగిపోతోంది. వాడు కలిస్తే కంగ్రాట్సు చెప్తా...

( దొంగ వచ్చి చెయ్యి చాచి నిల్చున్నాడు. చేతిలో తాళాలున్నాయి. రాంబాబు చేతికి అతని చెయ్యి తాకించి. మెల్లిగా తాళాలు అందించాడు. తర్వాత చెయ్యి అందించాడు )

రాం : ( అనుమానంగా ) తాళాలు లాగా – అరె మా బీరువా తాళాలే ఏయ్ ఎవరు నువ్వు ? నిన్నే ....పలకవేం.

దొంగ : సైలెన్స్ !! ప్లీజ్ సైలెన్స్ ! సైలెన్స్ ప్లీజ్ !

( దొంగ వెళ్ళిపోగా, రాంబాబు కంగారుగా దొంగ దొంగ దొంగా అంటూ స్టేజంతా గుండ్రంగా తిరుగుతుండగా ...)